

డిఆర్‌ఒగా శ్రీనివాసమూర్తి బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్ శ్రీనివాసమూర్తి శనివారం కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన ఎస్.డి.అనిత శనివారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. శ్రీనివాస్ మూర్తి గతంలో విజయనగరం ఆర్డీవోగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారిగా, ఇటీవల కాలం వరకు సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా పనిచేశారు. డిఆర్‌ఒగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసమూర్తి కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు ఆయన పైడితల్లి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

జిల్లా అంతటా ఒకటే ధర

- టన్ను ఇసుకకు రూ.150 తగ్గింపు
- స్టాక్ పాయింట్ వద్ద రూ.425.. రీచ్ వద్ద రూ.150 తవ్వకపు ధర
- ఎటువంటి సీనరేజీ లేదు : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇసుక తవ్వకపు ధర జిల్లా అంతటా ఒకేలా ఉండేలా జిల్లా కమిటీ నిర్ణయం తీసుకుంది. శనివారం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబెద్కర్ అధ్యక్షతన ఇసుక సరఫరా జిల్లా స్థాయి సమావేశం జరిగింది. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక తవ్వకపు ధర టన్ను కు రూ.425గానూ, నేరుగా రీచ్ వద్ద తీసుకునే వారికి 150 రూపాయలు గానూ ధరను నిర్ణయించారు. దీనికి ఎటువంటి సీనరేజి లేదని, రవాణా ఛార్జీలను మాత్రమే లబ్ధిదారులు చెల్లించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొత్త విధానం లో జిల్లాలో ఇసుకపై టన్నుకు రూ.150 తగ్గించినట్లు తెలిపారు. బొబ్బిలి, కొత్తవలస, డెంకాడ వద్ద ఉన్న స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ చేయాలని ఆదేశించారు. తూనిక యంత్రాల వద్ద నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, చీపురుపల్లి, బొబ్బిలి ఆర్‌డిఒలు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరితా, రవాణా ఉప కమిషనర్ మణి కుమార్, మైన్స్ డిడి మోహన్ రావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకై 1న రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్

జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల పిలుపు



విద్యార్థి కన్వెన్షన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని కోరుతూ నవంబర్ 1న తలపెట్టిన రాష్ట్ర స్థాయి విద్యార్థి కన్వెన్షన్ ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌ఒ విద్యార్థి సంఘాలు నాయకులు పిలుపునిచ్చారు. శనివారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో కాంప్లెక్స్ వద్ద గల ఎల్ బి జి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల విలేకరుల సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి. రాము, పిడిఎస్‌ఒ జిల్లా కన్వీనర్ బి రాకేష్ మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది బలిదానాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పనంగా అమ్మేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దీనిపై మేధావులు అదేవిధంగా ప్రజలు ఆలోచించి తమ స్పందన తెలియజేయాలని కోరారు. ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్ ప్లాంట్ తీవ్ర సంక్షోభంలోకి పాలకులు నెట్టారని, ఫలితంగా రోజుకు 21000 టన్నుల ఉత్పత్తి కావాల్సి ఉండగా, 6వేలు టన్నులు కూడా ఉత్పత్తి చేయడం లేదని తెలిపారు. దీనికి కారణం ఉత్పత్తిలో కీలకమైన మూడు బ్లాస్ట్ ఫర్నేస్లలో లో రెండింటిని మూసివేశారని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల భవిష్యత్తును దష్టిలో పెట్టుకొని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక తీసుకోవాలని కోరారు. ప్లాంట్ కు సొంత గనులు కేటాయించి లాభాల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు . ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ని రక్షించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ 1వ తేదీ ఉదయం 10 గంటలకు విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్ జరగబోతుందని తెలిపారు. ఈ కన్వెన్షన్ కు జిల్లాలోని విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్ , పిడిఎస్‌ఒ అధ్యక్షులు సోమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి రమేష్, శిరీష జిల్లా కమిటీ సభ్యులు సోమేశ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో రూ.4 కోట్లకు టోకరా

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో చిట్టీల పేరుతో రూ.నాలుగు కోట్లకు టోకరా వేశారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. భీమిలి మండలం వలందపేట గ్రామానికి చెందిన ఓ మహిళ చిట్టీలు వేయడంతో చాలామంది కట్టారు. తర్వాత డబ్బులు చెల్లించకపోవడంతో మోసపోయామని గుర్తించారు. శనివారం కొంతమంది బాధితులు వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ.80 లక్షల వరకు ఫిర్యాదులు వచ్చాయని సిఐ ప్రభాకర్ అన్నారు. ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఇంకా దీనిపై కేసు నమోదు చేయలేదని చెప్పారు.

ఐఎంఎస్ యాప్‌పై ఫిర్యాదు

ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఐఎఎస్ యాప్‌లో రూ.తొమ్మిది లక్షలు మేర మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

పిఎం స్వానిధి పథకం అమల్లో నగరపాలక సంస్థకు అవార్డు

ప్రజాశకి-విజయనగరం టౌన్

పిఎం స్వానిధి పథకం అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పురపాలక మరియు నగరపాలక సంస్థలకు ఈనెల 29న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డులు అందించనున్నారు. ఈ అవార్డునకు విజయనగరం నగరపాలక సంస్థ ఎంపికైనట్లు మెప్మా ఎమ్‌డి తేజ్ భరత్ నుంచి తమకు పిలుపు వచ్చిందని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. న్యూ ఢిల్లీలోని జాయింట్ సెక్రెటరీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఈ అవార్డు అందజేస్తుందని తెలిపారు.

11లోగా టెన్త్‌పరీక్ష ఫీజు చెల్లించాలి : డిఇఒ

విజయనగరం టౌన్ : వచ్చే మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈనెల 28 నుంచి నవంబర్ 11 తేదీ లోపు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఫీజులు చెల్లించాలని డిఇఒ యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటువిద్యార్థులు ఫీజులు కట్టాలని తెలిపారు. అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టులు లోపు రూ,110, మూడు సబ్జెక్టులు దాటితే రూ.125 చెల్లించాలన్నారు. నవంబర్ 11 తేదీ దాటితే అపరాధ రుసుము తో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజులు ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పేరుతో చెల్లించాలన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేయాలి : ఎస్‌పి

విజయనగరంకోట : జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీట్లు, ఇతర బ్యాడ్ క్యారక్టరు కలిగిన వ్యక్తులను ప్రతీ శనివారం పోలీసు స్టేషనుకు పిలిచి, మంచి ప్రవర్తన కోసం కౌన్సిలింగు నిర్వహించాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. రౌడీ షీట్లు కలిగిన వ్యక్తుల ప్రవర్తన, నిర్వర్తించే పనులు, ప్రస్తుతవారి జీవన విధానం పట్ల నిఘా పెట్టాలన్నారు. రౌడీ షీటర్ల దురుసుగా ఉంటూ, మళ్ళీ నేరంకు పాల్పడే అవకాశం ఉన్నట్లుగా వారి ప్రవర్తన ఉంటే బైండోవరు చేయాలని, నేర ప్రవృత్తిని విడనాడకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలన్నారు.

పారిశుధ్య బాధ్యత కార్యదర్శులదే

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

గ్రామ పంచాయతీల పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులదే పూర్తి బాధ్యతని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టంచేశారు. శానిటేషన్ గ్రూపుల్లో తన ఫోన్ నంబర్ నమోదు చేయాలన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల మంచినీటి నిర్వహణ, పారిశు ధ్యంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం అంతంత మాత్రంగానే ఉందని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీల్లో నీటి సరఫరా సక్రమంగా నిర్వహించేందుకు గ్రామస్థాయిలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయం, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని, నిర్దేశిత సమయాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్యం, నీటి సరఫరాకు సంబంధించి సమస్యలను ఎంపిడిఒ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లను సక్రమంగా వినియోగించుకుని తడి, పొడి చెత్తలను సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలను ఆదేశించారు. గ్రామ పంచాయతీలను సాధారణ నిధులు వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలంనాయుడు, ఎంపిడిఒలు జి.గిరిబాల, కళ్యాణి, వైవి.రాజేంద్ర ప్రసాద్, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో బాలికల నిష్పత్తి తగ్గడం తో అన్ని స్కానింగ్ కేంద్రాలను పోలీస్, ఆర్‌డిఒలు కలసి తనిఖీలు చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లాలో 1000 మంది మగ శిశువులకు 918 మంది ఆడ శిశువులు నమోదు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపోర్టింగ్ తప్పా లేక స్కానింగ్ కేంద్రాల్లో టపాలు జరుగుతున్నాయా అనే విషయాలు పై తనిఖీలు చేసి నివేదికలు అందించాలన్నారు. శనివారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పిసి పిఎన్ డిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కొత్తగా నమోదు చేసుకున్న విజయనగరం, రాజాంలో 2 స్కానింగ్ కేంద్రాలకు అనుమతులిచ్చారు. రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న 6 కేంద్రాలకు ఆమోదం తెలిపారు. ఈ స్కానింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు ఉన్నదీ లేనిదీ తనిఖీలు చేయాలని తెలిపారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డా.భాస్కర రావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, బొబ్బిలి, చీపురుపల్లి ఆర్‌డిఒలు, డిఎస్‌పి వీర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యాపారాలు సులభతరం

విజయనగరంటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యాపార లావాదేవీలు సులభతరంగా నిర్వహించుకోవాలని కమిషనర్ పి. నల్లనయ్య వ్యాపారులకు సూచించారు. శనివారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ విధానంపై నగర స్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం ద్వారా అమ్మకాలు కొనుగోలు విస్తత పరుచుకుని ఆర్థిక సాధికారతను సాధించాలని అన్నారు. ఈ విధానం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ఉత్పత్తి చేసిన సరుకులు, ఉత్పత్తులను ఆన్లైన్ విధానంలో అమ్మకాలు సాగించుకోవచ్చు అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం డిడి మధుసూదన్ రెడ్డి, మెప్మా ఇన్చార్జి పీడీ కె.శ్రీనివాసరావు, టిపిఆర్‌ఒ సింహాచలం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షులు వెంకటాచలం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రెసిడెంట్ ముచ్చు రామలింగేశ్వర రావు, హొటల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, బాలాజీ వస్త్ర మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

విజయనగరం టౌన్ : నగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి 29వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహిస్తామనిజిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కనకల కృష్ణ, వి.రమేష్ తెలిపారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 150 మంది హాజరవుతారని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పోటీలకు ముఖ్య అతిథిగా విజయనగరం ఎమ్మెల్యే అతిథిగజపతిరాజు హాజరవుతారని తెలిపారు. పోటీల్లో ఒకటి నుంచి ఐదు స్థానాలు వరకు నిలిచిన వారికి నగదు బహుమతి తో పాటు షీల్డ్, ప్రశంస పత్రాలు అందజేస్తామన్నారు. అనంతరం పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ వర్మ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవ అమూల్యమైనది

గురుదేవ్ ట్రస్టును అభినందించిన కలెక్టర్



కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కొత్తవలస

ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా నిస్వార్థంగా చేసే సేవ ఎంతో విలువైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. గురుదేవ్ ఛారిటబల్ ట్రస్ట్ ద్వారా దాని వ్యవస్థాపకులు జగదీష్ బాబు చేస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. కొత్తవలస మండలం మంగళంపాలెంలోని గురుదేవ ఛారిటబుల్ ట్రస్టును జిల్లా కలెక్టర్ అంబేద్కర్ శనివారం సందర్శించారు. ఇక్కడ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని, 50 పడకల ఆసుపత్రిని, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, నిర్మాణంలో ఉన్న కేన్సర్ ఆసుపత్రిని పరిశీలించారు. ఆయా విభాగాల గురించి జగదీష్‌బాబు వివరించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, వివిధ కృత్రిమ అవయవాలకోసం వచ్చిన వికలాంగులతో కలెక్టర్ ముచ్చటించారు. ట్రస్టు ద్వారా వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం పలువురు విభిన్న ప్రతిభావంతులకు కత్రిమ అవయవాలను, వినికిడి యంత్రాన్ని, పేదలకు తోపుడు బళ్లను ట్రస్టు ద్వారా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వికలాంగులకు, పేదలకు గురుదేవ ట్రస్టు ద్వారా నిస్వార్థంగా సేవలు అందుతున్నాయని అన్నారు. సుమారు 27 ఏళ్లుగా ఎంతో విలువైన సేవలను అందిస్తున్న జగదీష్‌బాబును ఆయన అభినందించారు. సమాజ సేవ కూడా మహా యజ్ఞం లాంటిదని, అడ్డంకులను సష్టించేందుకు కొంతమంది ప్రయత్నించినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. సమాజానికి అత్యంత విలువైన సేవలను అందిస్తున్న గురుదేవ ఛారిటబుల్ ట్రస్టుకు దేశవ్యాప్తంగా గొప్ప గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ట్రస్టు వ్యవస్థాపకులు రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ, సంస్థ ప్రస్థానాన్ని వివరించారు. గత 27 ఏళ్లనుంచి ఇప్పటివరకు సుమారు 2,50,000 మందికి కత్రిమ అవయవాలను అందించామని తెలిపారు., ప్రపంచంలోనే అత్యంత చౌకగా, నాణ్యతతో కూడిన కృత్రిమ అవయవాలను తాము తయారు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోనే 100 పడకలతో తొలి కేన్సర్ ఆసుపత్రిని తమ ట్రస్టు నిర్మిస్తోందని తెలిపారు. ఈ ఆసుపత్రిని డిసెంబరు 20న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.నీలకంఠరావు, ఎంపిడిఒ ఎస్.రమణయ్య, చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారాంపాత్రుడు, ఆసుపత్రి సిఇఒ డాక్టర్ రాఘవేంద్రరావు తదిరులు పాల్గొన్నారు.

పిటిసిలో ఆయుధాల ప్రదర్శన



పిటిసిలో ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్రరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు శిక్షణ కళాశాలలో ప్రిన్సిపాల్ రామచంద్రరాజు ఆధ్వర్యాన ఆయుధాల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ అమరుల దినోత్సవం ప్రాముఖ్యతను, పోలీసు సిబ్బంది చేస్తున్న సేవ గురించి, విధి నిర్వహణలో వారికి ఎదురయ్యే కష్టనష్టాలను గురించి వివరించారు. ప్రస్తుతము పలు రాష్ట్రాల్లో అంతర్గత తీవ్రవాదంతో పోలీసు ఎదుర్కొంటున్న సవాళ్ళు, ప్రాణ త్యాగాలను వివరించారు.కార్యక్రమానికి పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పివి అప్పారావు, డియస్‌పిలు సిహెచ్ రామారావు, టి.రమేష్ , సిఐలు, ఆర్ఐలు, ఎస్.ఐలు, , ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


అలరించిన పోలీసు డాగ్స్ విన్యాసాలు

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీసు డాగ్స్ లప్పీ, రుబీ విన్యాసాలు విద్యార్థులను అలరించాయి. పోలీసు డాగ్స్ విధి నిర్వహణలో ఎలా క్రమశిక్షణతో వ్యవహరిస్తాయో, హ్యాండలర్స్ కమాండ్స్ అనుగుణంగా ఏవిధంగా సెల్యూట్, మార్చ్, కూర్చోవడం, రోలింగు చేస్తాయో ప్రత్యక్షంగా పోలీసు డాగ్స్ తో చేయించగా, విద్యార్థులు తిలకించారు. నేర స్థలంలో నిందితుడి చెమట వాసన బట్టి, ఎంత మందిలో ఉన్న సదరు వ్యక్తిని ఏవిధంగా డాగ్ గుర్తిస్తుందోనన్న విషయాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పి వకుల్‌జిందాల్, ఎఎస్‌పి సౌమ్యలత, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బొబ్బిలి పోలీస్‌స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. డిఎస్‌పి శ్రీనివాసరావు విద్యార్థులతో మమేకమై ఓపెన్ హౌస్ అంటే ఏమిటి? పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రకాల విధులు, ట్రాఫిక్ కంట్రోల్‌లో ఉపయోగించే పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ, డాగ్ స్క్వాడ్, క్రైమ్ సీన్ పరికరాలు, రిసెప్షన్, ఆయుధాల గురించి వివరించారు. ఎస్‌హెచ్ఒ కె.సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి.. ఓపెన్ హౌస్‌కు హాజరైన విద్యార్థులు



జామి ఎంపిడిఒకు వినతులు అందిస్తున్న సర్పంచులు

పంచాయతీల ద్వారానే ఉపాధి పనులు

ఎంపిడిఒలకు సర్పంచుల బృందం వినతులు

ప్రజాశక్తి - జామి

ఉపాధి హామీ ద్వారా మంజూరైన మెటీరియల్ కాంపొనెంట్ పనులను పంచాయతీల ద్వారానే చేపట్టాలని మండలంలోని సర్పంచుల బృందం ఎంపిడిఒ నీలం అప్పలనాయుడును కోరింది. ఈ మేరకు శనివారం ఎంపిపి అరుణ, జెడ్‌పిటిసి సభ్యులు సరయు ఆధ్వర్యంలో సర్పంచులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయనకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు సుబ్రహ్మణ్యం, సూర్యారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధం లేకుండా, పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. పంచాయతీలు తీర్మానించిన టెండర్‌ను ఎంపిక చేయకుంటే న్యాయపరమైన సవాళ్లను అధికారులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో జామి సర్పంచ్ ఇప్పాక లక్ష్మి, అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఉపాధిహామీ పనులు సర్పంచులకే అప్పగించాలని వారంతా ఎంపిడిఒ రామకృష్ణరాజును కోరారు. సౌత్ సెంట్రల్ రైల్వేబోర్డు సలహా మండలి సభ్యులు అంబల్ల శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపిపి సారిక వైకుంఠం మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూటమి పార్టీల నాయకులకు అప్పగించడం చట్టవ్యతిరేకమన్నారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం గ్రామాల్లో చేపట్టే పనులను సర్పంచ్‌లకే అప్పగించాలని స్పష్టం చేశారు. స్పందించిన ఎంపిడిఒ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



డయేరియాతో మరణించిన కుటుంబాలకు న్యాయం జరిగేనా? ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ అందుకు అనుగుణంగా సిఫార్సులు చేస్తుందా? లేక ప్రభుత్వ యంత్రాంగం చెబుతున్నట్టు డయేరియా మరణం ఒక్కటే అన్నట్టుగా నివేదికలు ఇస్తాయా? అన్న అంశాలపై జిల్లాలో సర్వత్రా చర్చ నడుస్తోంది. గుర్లలోని డయేరియా మరణాలు, ఆ మండలంలో నమోదైన వందలాది డయేరియా కేసులు సుమారు పది రోజులుగా జిల్లాను ఉలికిపాటుకు గురిచేశాయి. ఈ మండలంలోపాటు చీపురుపల్లి, గరివిడి, దత్తిరాజేరు, గజపతినగరం తదితర మండలాల్లో కూడా కేసులు నమోదవుతున్నాయి. ఈనేపథ్యంలో ముఖ్యంగా చంపావతి నదీపరివాహక ప్రాంతంలోని గ్రామాలు, పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న చంపావతి జలాలను తాగేందుకు జనం ఉలిక్కిపడుతున్నారు. ఈ సంగతి అటుంచితే గడిచిన 15రోజుల్లో గుర్ల గ్రామంలో 10మంది చనిపోయారు. మరికొన్ని గ్రామాల్లో నాలుగైదు మరణాలు కూడా డయేరియావల్లే సంభవించాయంటూ ప్రతిపక్ష వైసిపి విమర్శిస్తోంది. మొత్తం 14మందికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం చెల్లించాలంటూ ఇటీవల గుర్ల గ్రామాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించిన వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంతకు ముందు నుంచే సిపిఎం నాయకులు గుర్ల, చీపురుపల్లి మండలాల్లోని పలు గ్రామాలు, ఆసుపత్రులను సందర్శించారు. బాధిత కుటుంబాలవారికి రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ఇటీవల జరిగిన మరణాలన్నీ డయేరియా వల్లే సంభవించాయని, అధికారులు, జిల్లాకు చెందిన మంత్రి ఒక్కరే అని చెప్పడం తమను బాధిస్తోందంటూ గ్రామాన్ని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎదుట స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా శనివారం ఉత్తరాంధ్ర అభివృద్ధిక వేదిక, ప్రజారోగ్యవేదిక నాయకులు కూడా పర్యటించారు. ఇలా అన్ని పార్టీలు, ప్రజా సంఘాల నుంచి ఒత్తిడి పెరగడంతో మరణాలపై విశ్లేషించేందుకు ఈనెల 24న నలుగురు వైద్య నిపుణులతో కూడిన కమిటీ నియమించింది. అంతకు ముందే గుర్ల గ్రామంలో డయేరియా ప్రభలడానికి గలకారణాలపై తొలుత ఆరుగురు వైద్యులతో కూడిన వైద్యులు, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్లతో వైద్య బృందాన్ని నియమించిన సంగతి తెలిసిందే. పైపులైన్ల ద్వారా అందిన కలుషిత నీరే డయేరియాకు కారణమని మూడు రోజుల క్రితమే ఆ కమిటీ తేల్చింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖకు నివేదిక కూడా ఇచ్చింది. మరోవైపు ఈనెల 22న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కూడా అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందిని విచారించడంతోపాటు గుర్ల గ్రామాన్ని సందర్శించారు.

ఇలా కమిటీలపై కమిటీలు వేస్తూ, డయేరియా ప్రబలిన సమయంలో కాలయాపన చేయడం తప్ప ఇబ్బందుల్లోవున్న బాధిత కుటుంబాలను ఆదుకునేందు ముందుకు సాగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్లతోపాటు ఆ మండలంలో డయేరియాతో మరణించిన వారందరికీ ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని జిల్లా పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించడం అభినందనీయం. తీర్మాణం చేసి వదిలేస్తే ప్రభుత్వం తనంతట తాను సానుకూలంగా స్పందించే పరిస్థితి లేదు. ఇప్పటి వరకు అధికారులు చేసిన ప్రకటనలు, వారిని వెనకేసుకు వస్తున్న ప్రభుత్వ తీరు అందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలో డయేరియా మృతులకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందో లేదోనని జిల్లా ప్రజానీకం ఆసక్తికరంగా ఎదురు చూస్తోంది.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు
పోలీసు స్కూల్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

గజపతినగరం మండలం పెదకాద హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ - 17 అథ్లెటిక్స్ విభాగంలో హైజంప్ పోటీల్లో విజయనగరం పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.జై గణేష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలోజరిగే స్కూల్ గేమ్స్ , అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, ఆర్ఎస్ఐ గోపాల నాయుడు, వెల్ఫేర్ ఆర్ఎస్ఐవర ప్రసాద్ , ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పి.జై గణేష్ తో కలిసి ఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలిశారు. నవంబరు 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబర్చి, క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్‌పి ఆకాంక్షించారు.

హమాలీ ఛార్జీలు పంపిణీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస, చల్లవానితోట పంచాయతీ పరిధిలోని ఆర్ఎస్‌కె పరిధిలోని 224 మంది రైతులకు శనివారం శ్రీ రామాంజనేయ ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో హమాలీ ఛార్జీలను పంపిణీ చేశారు. 2020- 21కి సంబంధించిన హమాలీ ఛార్జీలు క్వింటాకు రూ.25 చొప్పున రూ.2,64,690 అందించినట్లు ఎఫ్‌పిఒ సిఇఒ ఎ.ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో కుమిలి పిఎసిఎస్ చైర్మన్ పతివాడ శ్రీను, ఎఎంసి వైస్ చైర్మన్ ఇజ్జరౌతు ఈశ్వరరావు, డైరెక్టర్లు మహంతి రమేష్, పి.అప్పారావు, గాదిపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రామ్‌కుమార్ అన్నారు. పట్టణంలో మిలటరీకాలనీ పక్కనున్న చెరువు ఆక్రమణకు గురికావడంతో శనివారం అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. చెరువు ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమిస్తే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. ఆయనతో విఆర్ఒ సురేష్, సర్వేయర్ సంతోష్ ఉన్నారు.

పందుల బారి నుంచి పంటలను రక్షించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పందుల బారి నుంచి పంటలను రక్షించాలని ఎపి రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలో పందులు నాశనం చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో పందుల బెడద ఎక్కువగా ఉందన్నారు. వరిపంట నాశనం చేసి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉణుకూరు సమస్యల పరిష్కారానికి తీర్మానం

ప్రజాశక్తి-రేగిడి

ఉణుకూరులో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం శాఖా మహాసభ తీర్మానించింది. ఈ మేరకు శనివారం ఉణుకూరులో సిపిఎం శాఖా కార్యదర్శి మడపాన త్రినాథ్ అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు మాట్లాడుతూ పంచాయతీలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయని, కాలువలు నిర్మించలేదని చెప్పారు. వీటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు వంజరాపు తిరుపతిరావు, పోరెడ్డి విశ్వనాథం పాల్గొన్నారు.

అద్దె చెల్లించని షాపులు సీజ్

ప్రజాశక్తి-బొబ్బిలి

అద్దె చెల్లించని మున్సిపల్ షాపులను అధికారులు శనివారం సీజ్ చేశారు. ఆరి గంగయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె బకాయిలున్న షాపులను ఆర్ఒ నాగరాజు ఆధ్వర్యంలో షాపులను సీజ్ చేశారు. షాపు యజమానులు సక్రమంగా అద్దెలు ప్రతినెలా చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న లోక్‌అదాలత్

ప్రజాశక్తి-రాజాం

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణసాయితేజ, పిపి కె.సూర్యకుమార్, పట్టణ సిఐ కె.అశోక్ కుమార్, ఎక్సైజ్ సిఐ జైభీమ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ ఎం.శ్రీను మిల్లర్లను ఆదేశించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోనె సంచులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. నవంబర్ పదోతేదిలోగా బ్యాంకు గ్యారెంటీలు తీయాలని సూచించారు. సమావేశంలో సిఎస్ డిటి సాయికుమార్ పాల్గొన్నారు.

29న రేగిడి మండల సమావేశం

ప్రజాశక్తి-రేగిడి

మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న ఎంపిపి అప్పలనరసమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్యామల కుమారి తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. అధికారులు గత సమస్యలు పరిష్కారమైనవి, ఇంకా పరిష్కారం కానివి పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజాం

నియోజకవర్గంలో ఎవరైనా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు కిరాణా, పాన్‌షాప్, కూల్ డ్రింక్స్ షాపుల పేరుతో బోర్డులు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తమ సిబ్బందితో దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

రాజన్న కుటుంబానికి జెడ్‌పి చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి-కొత్తవలస

మంగలపాలెంకు చెందిన మాజీఎంపిపి పొలమర శెట్టి రాజన్న ఇటీవల చెందారు. ఈనేపథ్యంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు రాజన్న కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోకొప్పల వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, కొత్తవలస ఎంపిపి గోపమ్మ , గొరపల్లి శివ, మేళాస్త్రి అప్పారావు, గొరపల్లి రవి, అనిల్, పల్లా భీష్మ, గనిశెట్టిపాలెం సర్పంచ్ జామి ఈశ్వరరావు పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలో మూలబొడ్డవర పంచాయతీలో కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న బంగారు నాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్ కుమార్‌ను సర్పంచ్ మీనా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కరోనా సమయంలో కార్యదర్శి బంగారు నాయుడు అందించిన సేవలను గ్రామస్తులు గుర్తుచేసుకుని, ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, టిడిపి నాయకులు ఇందుకూరి శ్రీనురాజు, వైస్ సర్పంచ్ ఆడారి అప్పారావు, నాయకులు దేవవరపు సన్యాసి దేవుడు, మురళిరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎస్.వెల్గాం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి.జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం డెక్కా అర్జున్, ఉపాధ్యాయులు రమా కుమారి పాల్గొన్నారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

ఎమ్మెల్యేలు బేబినాయన, మురళీమోహన్

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. టిడిపి సభ్యత్వ నమోదుపై శనివారం కోటలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మొదటి సభ్యత్వాన్ని బేబినాయన తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. టిడిపి సభ్యత్వం తీసుకుంటేనే సంక్షేమ పథకాలు ఇస్తామని బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడం వద్దన్నారు. పార్టీపై అభిమానంతో సభ్యత్వం చేసుకునేలా చూడాలన్నారు. నీటి సంఘాలు, కో-ఆపరేటివ్ ఎన్నికల్లో విజయానికి పనిచేయాలని కోరారు. స్వార్థ రాజకీయాలు చేస్తే టిడిపికి దూరంగా ఉండాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ, మండల అధ్యక్షులు శరత్, సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయనగరం కోట : టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం జిల్లా పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో పండగ వాతావరణంలో జరిగింది. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి తొలుత సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం నగరంలోని పలు డివిజన్లు, మండలంలోని పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున వచ్చిన నాయకులు, కార్యకర్తలు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి రాజేష్‌బాబు, వేచలపు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ నాయకులు ప్రసాద్ ,రొంగలి



బొబ్బిలి.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

రామారావు, పైడ్రాజు, శ్రీనివాసరావు, కంది మురళి, కనకల మురళి తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : సభ్యత్వ నమోదు ద్వారా కార్యకర్తలకు అండగా నిలిచేందుకు బీమాకు టిడిపి శ్రీకారం చుట్టిందని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని పినతాడివాడలో శనివారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వ నమోదుకు రూ.లక్ష, సాధారణ సభ్యత్వానికి రూ.100 రుసుం చెల్లించాలన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికీ రూ.5 లక్షలు బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా బంగార్రాజును నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, సువ్వాడ రవిశేఖర్, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, టిడిపి డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, కె.సత్యనారాయణ, కడగల ఆనంద్‌కుమార్, మహంతి శంకర్రావు, కలిదిండి పాణిరాజు పాల్గొన్నారు.

రాజాం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే తన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజాం పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజారును ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే అభిలషించారు. మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నంది సూరి ప్రకాష్, సుమల మన్మథ వెంకటరావు, గురువాన నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్, వంగా వెంకట్రావు, మరిది జగన్మోహన్, అడపా శీను, బవిరి శ్రీనుబాబు, జరజాన నితిన్ పాల్గొన్నారు.


తల్లి, చెల్లినే చూడని జగన్

ఎమ్మెల్యే కళా వెంకటరావు

ప్రజాశక్తి-మెరకముడిదాం

కొన్ని లక్షల కోట్లు ఉన్నా కనీసం తల్లిని, చెల్లెని చూడని మాజీ సిఎం జగన్.. ప్రజలకేమి చేస్తారని, అందుకే ఓటుతో తగిన బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ధ్వజమెత్తారు. శనివారం మండలంలోని గర్భాం గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైసిపిపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వంలో పంచాయతీలను నిర్వీర్యం చేశారని విరుచుకుపడ్డారు. జిల్లా పరిషత్ చైర్మన్ సహా సుమారు 90 శాతం సర్పంచులు వైసిపికి చెందిన వారేనని, పంచాయతీలకు విడుదల చేసిన నిధులతో పనులు చేయించుకోలేక, తిరిగి ప్రభుత్వంపై బురదచల్లడానికి సిగ్గులేదా? అని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే కళావెంకటరావు రూ.100 చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్ర శేఖర్, కుచ్చర్ల పాటి త్రిమూర్తుల రాజు, దన్నాన రామచంద్రుడు పాల్గొన్నారు.







విజయనగరం.. కార్యకర్త నుంచి సభ్యత్వ రుసుం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి ; డెంకాడ.. మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజును సత్కరిస్తున్న నాయకులు ; రాజాంలో సభ్యత్వ రుసుం చెల్లిస్తున్న ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్

రూ.4.78 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో ఈ ఏడాది రూ.4.78 కోట్లతో ఇరిగేషన్ పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఇరిగేషన్ ఎఇ ఎన్.హరి తెలిపారు. మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దీనికోసం 35 పనులు గుర్తించామన్నారు. ముఖ్యంగా ఏడొంపులగెడ్డ ప్రాంతంలో 2 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి కోటి 40లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మదుములు, చప్టాల నిర్మాణాలు కూడా చేపట్ట నున్నట్లు తెలిపారు. మండలంలో 5 నీటి సంఘాలు ఉన్నాయని, త్వరలోనే ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నా మన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.

టిడ్కో సముదాయాల వద్ద సౌకర్యాల కల్పన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడ్కో గృహ సముదాయాల వద్ద మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు సంపూర్ణ సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. శనివారం సోనియా నగర్, సారిపల్లి ప్రాంతాలలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను టిడ్కో అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సోనియా నగర్ వద్ద ఏర్పాటు చేసిన సీవేజ్ ప్లాంట్ ను పరిశీలించారు. టిడ్కో సముదాయాలకు వెళ్లే 30 అడుగుల సిసి రోడ్డును త్వరతి గతిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడ నివసిస్తున్న కొంతమందితో మాట్లాడి సమస్యలు తెలుసు కున్నారు. కార్యక్రమంలో టిడ్కో డిఇ శశిధర్, ఎఇ రాజీవ్ గాంధీ, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఎఇ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు

ప్రజాశక్తి-గుర్ల

భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహశీల్దార్ నారాయణమ్మ తెలిపారు. శనివారం మండలంలోని పాలవలస, నల్లచెరువు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంపిపి ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు మాట్లాడుతూ భూ రీసర్వే సమస్యలు తక్షణమే పరిష్కరించే దశగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లూరు రాము, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి, మండల ఉప సర్వేయరు శివ, గ్రామ సర్వేయర్ అమృత పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని నాయుడుపేట గ్రామంలో సమగ్ర భూరీసర్వే గ్రామసభను శనివారం నిర్వహించారు. ఇందులో 35 దరఖాస్తులు అందాయని తహశీల్దార్ రాములమ్మ తెలిపారు. గ్రామ సభలో ఆర్ఐ లక్ష్మి పాల్గొన్నారు. చినగుడిపాలలో నిర్వహించిన గ్రామసభలో 39 దరఖాస్తులు అందాయి.



వేపాడ.. రాయుడుపేటలో గ్రామసభ నిర్వహిస్తున్న తహశీల్దార్ రాములమ్మ

భూఆక్రమణ ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని ఆరికతోటలో సర్వే నంబర్ 268లో తన భూమి ఆక్రమణకు గురైందని పెంకి రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌డిఒ మోహనరావు, తహశీల్దార్ సులోచనారాణితో కలిసి శనివారం విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 268-1 ప్రభుత్వ భూమి అని, 268-2 జిరాయతీ భూమిగా గుర్తించినట్లు తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. నివేదికను కలెక్టరేట్‌కు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్లు శ్రీనివాసరావు, సంతోష్, విఆర్ఒ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల ఘటన పునరావృతం కానివ్వొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

గుర్ల ఘటన పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో కోరారు. కలుషితమైన నీరు వల్ల గుర్లలో డయేరియా ప్రబలి పది మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి సురక్షితమైన తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు స్థానిక సంస్థలకు అధికారాలు ఇవ్వాలని కోరారు.

నెల్లిమర్లలో మెప్మా బజార్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీలో రామతీర్థం జంక్షన్ వద్ద మెప్మా బజార్‌ను శనివారం ప్రారంభించారు. మెప్మా బజార్‌ను మెప్మా పీడీ కె.శ్రీనివాసరావు, నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్పత్తులు, అమ్మకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం డి.గోవిందరావు, సిఒలు, ఆర్‌పిలు , ,పాల్గొన్నారు.



మెప్మా బజార్ పరిశీలిస్తున్న అధికారులు

3 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని గూడ్స్ షెడ్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా మూడు కేజీల గంజాయిని పట్టుకున్నట్లు వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు . శనివారం నాడు సాయంత్రం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్ఐ సురేందర్ నాయుడు ఆధ్వర్యాన సిబ్బంది వెహికల్స్ తనిఖీ చేస్తుండగా ఒక బైక్‌లో మూడు కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు మంగళగిరి గణేష్‌తో పాటు మరో మైనర్ వ్యక్తి ఒడిశా రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి దగ్గర గంజాయి తీసుకుని వచ్చి వేరే వారికి అమ్మడానికి చూస్తున్న సమయంలో పట్టుకున్నట్లు తెలిపారు. బైక్‌ను సీజ్‌చేసి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


ప్రజాశక్తి - వంగర

మండలంలోని వివిఆర్‌పేట సమీపంలో నాటుసారా తయారీకి ఉపయోగించే వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు పోలినాయుడు, కళారావు పాల్గొన్నారు.

నాటుసారా ధ్వంసం

ప్రజాశక్తి-కొత్తవలస

ఎక్సైజ్‌అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.ఇందిరాదేవి ఆధ్వర్యాన కొత్తవలస మండలం ముసిరాం గ్రామ పరిధిలో శనివారం దాడులు నిర్వహించారు. సుమారు 1200 లీటర్లు బెల్లపు ఊటను, 10 లీటర్లు నాటు సారాను ధ్వంసం చేశారు. ఈ దాడులలో ఎస్ఐ ఎస్‌వి రామారావు, హెచ్‌సి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి భోగాపురం, డెంకాడ

సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లోకం మాధవి.. శనివారం బాధితులకు అందజేశారు. భోగాపురం మండలం లింగాలవలసకు చెందిన బి.రమాదేవికి, డెంకాడ మండలం బంగార్రాజుపేటకు చెందిన వేంపాడ అప్పలరెడ్డికి చెక్కులను అందించారు. కార్యక్రమంలో గూడెపువలస సర్పంచ్ మట్టా అయ్యప్ప రెడ్డి, చెల్లుబోయిన రాము, సీతంనాయుడు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



నాట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో శ్రీచైతన్య యాజమాన్య ప్రతినిధులు

నాట్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం

శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాలెడ్జ్ ఎస్సెస్మెంట్ టెస్ట్ లో స్థానిక రింగ్ రోడ్డు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ పాఠశాల నుంచి 258మంది, బ్రాంచి 1 నుంచి 39 మంది మొత్తం 297 మంది విద్యార్థులు లెవెల్ 1లో అర్హత సాధించారని తెలిపారు. మాట్‌లో 102 మంది, పాట్‌లో 9మంది, చాట్‌లో 96 మంది అర్హత పొందారని తెలిపారు. వీరంతా సెకండ్ లెవెల్ కు వెళతారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారితో పాటు డీన్‌లు సూర్య చంద్ర, సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్ అభినందనలు తెలిపారు.

చిరంజీవికి ఘన నివాళి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మావోయిస్టుల దాడిలో మరణించిన కానిస్టేబుల్ చిట్టిపంతులు చిరంజీవి విద్యనభ్యశించిన కొట్టాం పాఠశాలను శనివారం సిఐ నారాయణమూర్తి సందర్శించారు. చిరంజీవిని స్మరిస్తూ ఘన నివాళు లర్పించారు. పోలీసుల విధుల గురించి, వారి అంకితభావం, సమాజానికి చేస్తున్న సేవల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ గంగరాజు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం సిద్ధం

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-రామభద్రపురం

పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శనివారం స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవల విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవల పథకం ద్వారా ఉచిత వైద్యం అందజేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, హాస్పిటల్ నిర్వాహకులు మజ్జి సిరిసహస్ర, డాక్టర్ రమేష్, భార్గవి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, కర్రోతు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు (రాజా) జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కోటలో శనివారం ఎమ్మెల్యే బేబినాయన కేక్ కట్ చేశారు. టిడిపి కోసం నిరంతరం పని చేసే రాజా జన్మదిన వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లాడ భాస్కరరావు, పువ్వల శ్రీనివాసరావు, శరత్, గెంబలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆర్‌టిసి సర్వీసుల పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఎం రమేష్

ఎస్.కోట డిపో నుంచి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తీర్థయాత్రలు, విహారయాత్రలకు శృంగవరపుకోట డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక డిపో వద్ద ఆయన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. రానున్న కార్తీకమాసం సందర్భంగా, ప్రముఖ క్షేత్రాలైన పంచరామాలు, శబరిమల తీర్థయాత్రలకు పల్లె వెలుగు, డీలక్స్, అల్ట్రా డీలక్స్, ఎసి బస్సులను నడుపుతున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

నైపుణ్యాలపై 'సీతం'లో కార్యశాల

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేట్స్ కోసం అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించేదుకు శనివారం కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన సీనియర్ క్వాలిటీ ఇంజినీర్ వి.ఎన్.చైతన్య హాజరై విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదుల్లో నేర్చుకునే సూత్రాలు, వాస్తవ ప్రపంచంలో వినియోగించే నైపుణ్యాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించడానికి నైపుణ్యాలు చాలా కీలకమని అన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తులో ముందడుగు వేయాలంటే ఈ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, పిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణు మాధవరావు పాల్గొన్నారు.